రూ.22 లక్షల నగదు స్వాధీనం

దుండిగల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో భాగంగా బాచుపల్లి ఎస్‌ఓటీ, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ. 22 లక్షలను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ శ్రీకృష్ణనగర్‌కాలనీకి చెందిన పి.అఖిల్, బోడుప్పల్ బుద్దానగర్‌కు చెంది న శశికిరణ్‌లు తెలంగాణ గోల్డ్ బయ్యర్స్‌లో మార్కెంటింగ్ చేస్తుంటారు. బుధవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా టీఎస్09ఇఎం3522, టీఎస్08జిఎల్1767 నెంబర్లు గల రెండు ద్విచక్ర వాహనాల్లో రూ. 22 లక్షలు లభించాయి. నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు వారి వద్ద లేకపోవడంతో పోలీసులు ఆ డబ్బుని స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బంజారాహిల్స్, మే 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధ వారం ఖైరతాబాద్ నియోకవర్గంలో ఎన్నికల ప్రచార తీరుపై అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీ మంత్రి తలసానితో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అన్ని సర్వేల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ముందంజలో ఉన్నాడని తేలిందన్నారు. ఖైరతాబాద్ ప్రజలు మొత్తం కాంగ్రెస్ అభ్యర్థి దానం మీద ఆగ్రహంతో ఉన్నారని, కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదనే అభిప్రాయం ప్రజల్లో ఉన్న కారణంగా పద్మారావు గౌడ్‌కే మద్దతు పలకాలని ఓటర్లు భావిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సమావేశంలో నగర బీఆర్ ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్. శ్రీనివాస్, పార్టీ నేతలు విప్లవ కుమార్, మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు మన్నె కవిత, వి.వెంకటేష్, ప్రసన్న రామ్మూర్తి, హేమలతా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బుధవారం యూసుఫ్ గూడ, శ్రీనగర్‌కాలనీలలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.

పద్మారావు గౌడ్‌కు సంపూర్ణ మద్దతు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా చేపట్టిన ప్రచారానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలు పద్మారావు గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఆయన అన్నారు.

● పద్మారావు గౌడ్‌కు మద్దతుగా భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లతో ప్రచారం చేశారు. భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, మైనార్టీ కమిటీ నాయకుడు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



సమావేశంలో ప్రొఫెసర్లు ఇటిక్యాల పురుషోత్తం, కాశిం, దక్షిణ భారత దళిత బహుజన సమితి ప్రతినిధులు

పంజాగుట్ట, మే 8(ఆంధ్రజ్యోతి): దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని వక్తలు అన్నారు. ప్రపంచంలోని పలు దేశాల రాజ్యాంగం కంటే మన రాజ్యాంగం బిన్నమైందని, దానిని ఎవరూ మార్చలేరని వారు పేర్కొన్నారు. దక్షిణ భారత దళిత బహుజన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో వక్తలు మాట్లాడారు. ఇన్ని సంవత్సరాలు జరిగిన ఎన్నికల్లో భారత రాజ్యాంగం అనేది చర్చనీయాంశంగా లేదని, ఎప్పుడూ చర్చలోకి రాలేదని ఓయూ ప్రొఫెసర్ కాశిం అన్నారు. కానీ ప్రస్తుతం రాజ్యాంగం చర్చనీయాంశం అయిందని, అందుకే రాజ్యాంగం గురించి మాట్లాడాల్సిన అవసరం వచ్చిందన్నారు. దేశంలో ప్రభుత్వం ఎలా పనిచేయలో మన రాజ్యాంగం చెబుతుందని, ప్రస్తుతం దేశం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, మనువాద సిద్ధాంతాన్ని, సూత్రాలను మళ్ళీ తీసుకొని రావాలని చూస్తున్నారని ఆరోపించారు. అందరూ సమానం అనే విషయాన్ని కొంతమంది అంగికరించడం లేదని, ఇప్పటికే కొత్త రాజ్యాంగం రూపొందించి ఉంటారని అన్నారు. మతం మత్తులో యువతను ముంచేశారని ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. రాజ్యాంగాన్ని చదవకుండా కొంత మంది మాట్లాడుతున్నారని, దానిని చదివితే అందులో ఏమి ఉందో తెలుస్తుందన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రమైన లౌకిక పదాన్ని తొలగించవద్దని డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాదును దేశ రెండో రాజధానిగా చేయాలని, సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రవీంద్రా చారి, ఉపాధ్యక్షుడు కొంకటి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దానం నాగేందర్, పక్కన అల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అల్కాలంబ తదితరులు



జవహర్‌నగర్‌లో దానం నాగేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న అజారుద్దీన్, నాగార్జున రెడ్డి,

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

- సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతోందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ లేక్ వ్యూ గెస్టుహౌస్‌లో బుధవారం నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా న్యాయ సమ్మేళనానికి దానం నాగేందర్‌తో పాటు ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కా లంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రతి నెల 2,500 అందజేస్తోందని గుర్తు చేశారు. రాజకీయంగా కూడా కాంగ్రెస్‌లోనే మహిళలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. అల్కాలంబ మాట్లాడుతూ.. దేశానికి తొలి మహిళ ప్రధాని ఇందిరాగాంధీని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మొదటి నుంచి మహిళలకు తగిన ప్రాధాన్యం నిచ్చే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతీ నాయక్, ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ, సికింద్రాబాద్ మహిళా అధ్యక్షురాలు పుస్తకాల కవిత తదితరులు పాల్గొన్నారు.

పలువురి చేరిక

దానం నాగేందర్ సమక్షంలో బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ ఎస్ కార్వాన్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్, నాయకులు నిహాల్ సింగ్, శ్రీకాంత్, అశోక్ తేజ, రాజేందర్ యాదవ్, నర్సింగరావు తదితరులు పార్టీలో చేరారు. వారికి దానం నాగేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అందరూ కాంగ్రెస్ వైపే..

బస్తీలు, కాలనీలు తేడా లేకుండా అందరూ కాంగ్రెస్‌తోనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో దానం నాగేందర్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపిస్తారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు అన్నారు. ఇందిరానగర్‌లో ఆయన దానం తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు స్వామిగౌడ్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పంజాగుట్ట: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

దానంకు మద్దతుగా నేతల ప్రచారం

సనత్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని సనత్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ నేతలు పలు బస్తీల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు ఓటు వేయండి.. అభివృద్ధికి బాట వేయండి'

యూసుఫ్‌గూడ: కాంగ్రెస్‌కు ఓటు వేయండి.. అభివృద్ధికి బాట వేయండి అంటూ రెహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి బుధవారం కార్యకర్తలు, నాయకులతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● యూసుఫ్‌గూడ డివిజన్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం మురళిగౌడ్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు.సీనియర్ నాయకులు ఎండి హమ్‌దమ్, చంద్రమౌళి, వినోద్‌కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

అమీర్‌పేట: దానం నాగేందర్‌ను గెలిపించాలని బుధవారం ఆ పార్టీ శ్రేణులు అమీర్‌పేటలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

'కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి'

రాంగోపాల్‌పేట్: దానం నాగేందర్‌కు మద్దతుగా బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి చెందుతుందని, దానంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

యువతిపై లైంగిక దాడి.. యువకుడిపై కేసు

యూసుఫ్‌గూడ, మే 8(ఆంధ్రజ్యోతి): సన్నిహితంగా ఉన్న యువతిపై లైంగిక దాడి చేసిన ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. హైదరాబాద్‌లోని తన అక్క ఇంటికి జనవరిలో వచ్చిన యువతి అమీర్‌పేటలో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటోంది. ఈ నేపథ్యంలో మార్చిలో అక్క ఇంటికి సమీపంలోని తమకు బంధువైన సాయికృష్ణ పరిచయమయ్యాడు. బంధుత్వం ఉండడంతో మీ చెల్లిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని సాయికృష్ణ అనే యువకుడు ఆమె అక్కతో చెప్పాడు. ముందు చదువు పూర్తి చేసిన తర్వాత ఆలోచిద్దామని చెప్పిన యువతి అక్క ఇందుకు ఒప్పుకోలేదు. ఆ తరువాత ఒక రోజు సాయికృష్ణ, ఫోన్ చేసి ఇంట్లో మా అమ్మ లేదు అన్నం వండడానికి రమ్మని యువతికి ఫోన్ చేశాడు. బంధువు కదా అని ఇంటికి వెళ్లిన యువతిపై లైంగిక దాడి చేసి ఫొటోలు, వీడియో తీశాడు. ఆ యువతి సాయికృష్ణతో తనకున్న పరిచయం గురించి తల్లికి చెప్పగా, గోత్రం ప్రకారం మీరిద్దరూ అన్నాచెల్లి వరుస అవుతారని, పెళ్లి చేసుకోకూడదని చెప్పింది. అప్పటి నుంచి ఆ యువతి సాయికృష్ణకు దూరంగా మలక్‌పేటలోని మరో అక్క ఇంటికి వెళ్లింది. ఇదే సమయంలో పెద్దలు ఆమెకు మరో వ్యక్తితో వివాహం చేయాలని నిర్ణయించారు. ఈతరుణంలో ఇద్దరూ కలిసిన ఫొటోలు, వీడియోలు డిలీట్ చేయమని యువతి సాయికృష్ణను కోరింది. దానికి సాయికృష్ణ నిరాకరించడంతో మనస్తాపానికి చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను కాపాడిన కుటుంబ సభ్యులకు ఫొటోలు, వీడియోల గురించి చెప్పింది. యువతి బంధువులు సాయికృష్ణను ఫొటోలు వీడియో డిలీట్ చేయమని అడిగితే తాను డిలీట్ చేయనని చెప్పాడు. ఆ ఫోటోలను తన మిత్రులకు కూడా పంపానని తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న యువతికి కాబోయే భర్త వివాహాన్ని రద్దు చేసుకున్నాడు. దాంతో సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలని యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

చెరువులో ఈతకెళ్లి వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి చెరువులో ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారానికికి చెందిన నవీన్‌చారి కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు. ముగ్గురు స్నేహితులతో శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయానికి బుధవారం వెళ్లారు. అమ్మవారిని దర్శనం అనంతరం శామీర్‌పేట చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. నవీన్‌చారి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు యత్నించినా ఫలితం లేదు. దీంతో వారు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువులో గాలించి నవీన్‌చారి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారులకు రైల్వే పోలీసుల అవగాహన



మౌలాలి రైల్వే గేటు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య

మల్కాజిగిరి, మే 8(ఆంధ్రజ్యోతి): రైల్వే గేటు పడినప్పుడు వాహనదారులు నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రైల్వే ఎస్‌ఐ కృష్ణయ్య హెచ్చరించారు. మౌలాలి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద సిబ్బందితో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. గేటు వేస్తే తెరిచే వరకు వాహనదారులు వేచి ఉండాలని, గేటు కింద నుంచి వెళ్లొద్దని సూచించారు.

ఓటును నిర్భయంగా వేయాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు

చిక్కడపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేయాలని ఎలాంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ప్రజలకు సూచించారు. చిక్కడపల్లి పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బెటాలియన్ బృందాలు బుధవారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని పలు కీలకప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ముఖ్యంగా బాగ్‌లింగంపల్లిమాస్ ప్రాంతాలైన పాలమూరుబస్తీ, సూర్యానగర్, ఈడబ్ల్యుఎస్ క్వార్టర్స్, సంజయ్‌నగర్, నెహ్రూనగర్, లంబాడితండా తదితర ప్రాంతాల్లో బృందాలు ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీతయ్యతోపాటు ఎస్‌ఐలు అభిలాష్, శశిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ముషీరాబాద్ పీఎస్ పరిధిలో సీఐ నిరంజన్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్‌తోపాటు పోలీసులు బుధవారం రాత్రి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

వర్షానికి విరిగిపడ్డ చెట్ల కొమ్మలు





మధురానగర్ సీ-బ్లాక్‌లో విరిగిపడ్డ చెట్టుకొమ్మ, మధురానగర్ డీ-బ్లాక్‌లో చెట్టుకొమ్మను తొలగిస్తున్న సిబ్బంది

వెంగళరావునగర్, మే 8(ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి మధురానగర్, వెంగళరావునగర్ కాలనీల్లోని పలు బ్లాకులలో చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. అర్థరాత్రి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తెగిన విద్యుత్ తీగలకు సంబంధిత అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం మధురానగర్ కాలనీలోని సీడీఎఫ్, జీహెచ్ బ్లాకులలో, వెంగళరావునగర్ కాలనీలో విరిగిపడ్డ చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాలనీ సంక్షేమ సమితి సిబ్బంది తొలగించారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశం

అల్వాల్, మే 8(ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయింది. సమస్యను పరిష్కరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఐఆర్‌టీ బృందాలు సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి వరద నీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలో 39.91 కిలోమీటర్ల వరకు నిర్వహిస్తున్న ప్రధాన నాలాల పనులు పురోగతిలో ఉన్నాయని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేస్తామని ఆమె బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జోన్ పరిధిలో సర్కిళ్ల వారీగా ప్రతి వార్డుకు మాన్‌సూన్ టీమ్‌లను కేటాయించామన్నారు. ఈ టీమ్‌లో ట్రాక్టర్, నలుగురు కూలీలు, అత్యవసర సమయాల్లో వరదనీటిని తరలించడానికి మోటార్ పంపుసెట్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. రోడ్లపై నిలిచిన నీరును, క్యాచ్‌పిట్ అడ్డంకులను, రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించే పనులను మాన్‌సూన్ టీమ్‌లు నిర్వహిస్తాయన్నారు. సర్కిళ్ల వారీగా నాలాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాట్లను పూర్తి చేశామని ఆమె వెల్లడించారు. అల్వాల్ సర్కిల్‌పరిధిలో వరద సమస్యలపై ఈఈ శ్రీకాంతికి (నంబర్ 9701414306)ఫిర్యాదు చేయొచ్చన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



డేవిడ్

జవహర్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా కమాన్ సమీపంలో శ్రీరామ్‌నగర్ కాలనీలో ఆకుల సరిత, డేవిడ్(50) దంపతులు నివసిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీన గుట్కా ప్యాకెట్ల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి మద్యం తాగే అలవాటుతో పాటు మతిమరుపు ఉందని, గతంలో కూడా అదృశ్యమై 21 రోజుల తర్వాత ఘట్‌కేసర్ సమీపంలో లభించాడని భార్య సరిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడ్‌మెట్‌లో..



సునీల్ రాథోడ్

నేరేడ్‌మెట్ మే 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. నేరేడ్‌మెట్ జేజేనగర్‌లో నివసిస్తున్న కె.సునీల్ రాథోడ్(29) సైనిక్‌పురి పోస్టాఫీసులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తల్లి మణెమ్మ నేరేడ్‌మెట్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు

- ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

పేట్‌బషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేటకు చెందిన లక్ష్మణ్ కుమారుడు అమోగత్ తరుణ్ (21)అరోరా కాలేజీలో లా చదువుతున్నాడు. ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన విజయేందర్ కుమార్తె జి.గౌతమి(20) మైసమ్మగూడలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరు స్నేహితులు. బుధవారం కారులో మైసమ్మగూడ వెళ్తుండగా మార్గ మధ్యంలో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ సమీపంలో వేగంగా వెళ్తూ గుంతను తప్పించబోయి అదుపు తప్పడంతో చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఇద్దరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన కారు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల వారికి న్యాయం



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీఐ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

పంజాగుట్ట, మే 8(ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, దేశంలో చట్టాలు అమలు కావాలంటే కాంగ్రెస్ గెలవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీఐ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పంచాయతీ రాజ్ శాఖ రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎంఎ కరీం, రిటైర్డ్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, న్యాయవాదులు సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకునేందుకు మత సామరస్య పరిరక్షణ కోసం విద్యావంతులు, మేధావులు క్రియాశీల పాత్ర పోషించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు, కుల మతాలకతీతంగా తమ ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీఎం సూచించారని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత



ఏఐసీసీ పరిశీలకురాలు దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత అనిల్

ఖైరతాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల అనిల్ బుధవారం ఏఐసీసీ తెలంగాణ ప్రతినిధి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఎం.మధుకర్‌యాదవ్ ఆధ్వర్యంలో అనిల్ ఆమెను కలిశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

కాంగ్రెస్ పార్టీకే మద్దతు

- మల్కాజిగిరి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపిస్తాం

పంజాగుట్ట, మే 8(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంచార కులం వారి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.నర్సింహ ప్రకటించారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ఆయన అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఉపాధ్యక్షుడు ఆవుల ఎల్లయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించేందుకు ఇంటింటి ప్రాచారం చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో నర్సమ్మ, వెంకటమ్మ, లక్ష్మయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతికరంగ ఆప్తుడు సుబ్బారావు

- వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎందరో ఔత్సాహికులు, కళాకారులకు త్యాగరాయగానసభ వేదిక అందించి ప్రోత్సహించిన కళాసుబ్బారావు సాంస్కృతిక రంగ ఆప్తుడు అని వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గానసభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఇనాక్ పాల్గొని రంగస్థల ప్రముఖులు తుర్లపాటి రామచంద్రరావుకు కళా సుబ్బారావు స్మారక నాటక పురస్కారం బహూకరించి మాట్లాడారు. సుబ్బారావు గానసభ వ్యవస్థీకరణలో ప్రధాన పాత్ర పోషించి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగా వివిధ కళాప్రక్రియలకు, కళాకారులకు తనవంతు సహకారం అందించారన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ.. నాటకరంగంలో తనకు కళాసుబ్బారావు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. తమ తండ్రి సుబ్బారావు పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపచేస్తూ గానసభ వైభవాన్ని కొనసాగిస్తున్నామన్నారు. సినీనిర్మాత రామసత్యనారాయణ, సమాజసేవకులు పీఎస్ఆర్ మూర్తి, కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి పాల్గొని సుబ్బారావు సేవలను వివరించారు.

ఐదునెలల్లో రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తెలంగాణ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్ఆర్‌ఐ విభాగం ప్రతినిధులు అనిల్ కూర్మాచలం, తదితరులతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీనేతల్లో భయం మొదలై బీఆర్‌ఎస్‌పై కొందరు పనిగట్టుకొని విషప్రచారం మొదలు పెట్టారన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ఎంపీ అభ్యర్థుల కోసం ప్రధానిమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, తెలంగాణ ఎన్ఆర్‌ఐలు కేసీఆర్ వెంటే ఉన్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకొంటోందని, కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని ఆయన వెల్లడించారు.

రేవంత్ ప్రభుత్వం చెల్లని చెక్కులాంటిది!

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయకుండా.. పార్లమెంటు ఎన్నికల్లో ఓటువేయాలని ప్రజలను మళ్లీ కోరడం తగదని బీఆర్‌ఎస్ నేత రావు లక్ష్మీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మహిళలకు రూ. 2,500 ఇస్తున్నామని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరం.. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెల్లని చెక్కు లాంటిదని ఆరోపించారు. ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత కారణంగా.. కాంగ్రెస్ పార్టీ అభద్రతాభావంలో ఉందన్నారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదని, కేసీఆర్ ప్రభుత్వం అవినీతి చేస్తే కేంద్రంలో అధికారంలో ఉండి.. బీజేపీ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పొడిగింపు

కుత్బుల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు మరో రెండు రోజులు పొడిగించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,941 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా బుధవారం నాటికి మొత్తం 1,523 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునేందుకు బుధవారంతో గడువు ముగియడంతో మరో రెండు రోజులు (10వ తేదీ వరకు) ఎన్నికల సంఘం పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యం

● సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతోందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ లేక్ వ్యూ గెస్టుహౌస్‌లో బుధవారం నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా న్యాయ సమ్మేళనానికి దానం నాగేందర్‌తో పాటు ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కా లంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రతి నెల రూ.2,500 అందజేస్తోందని గుర్తుచేశారు. రాజకీయంగా కూడా కాంగ్రెస్‌లోనే మహిళలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ, సికింద్రాబాద్ మహిళా అధ్యక్షురాలు పుస్తకాల కవిత పాల్గొన్నారు.

పలువురి చేరిక

దానం నాగేందర్ సమక్షంలో బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్, నాయకులు నిహాల్ సింగ్, శ్రీకాంత్, అశోక్ తేజ, రాజేందర్ యాదవ్, నర్సింగరావు తదితరులు పార్టీలో చేరారు. వారికి దానం నాగేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

సికింద్రాబాద్, బౌద్ధనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ ప్రజలను కోరారు. బుధవారం రాత్రి సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ప్రచార ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీతాఫల్‌మండి, టీఆర్‌టీకాలనీ, మేడిబావి, రామాలయం వీధి, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్, వారాసిగూడ, కౌసర్‌మసీద్, బౌద్ధనగర్, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. యువనాయకుడు ఆదం సృజన్, నాయకులు జలంధర్ రెడ్డి, అమర్‌నాథ్‌గౌడ్, సందీప్‌రాజ్, కొండల్ వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్, షకీల్‌ఖాన్, మహ్మద్ వహీదుద్దీన్, గంటరాజు, అభిషేక్, గుంటి కృష్ణ, శిల్పాచారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అల్కాలంబ తదితరులు


సీతాఫల్‌మండిలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్

మానవత్వాన్ని నమ్మే వ్యక్తికి ఓటు వేయాలి

కోట నీలిమ

రాంగోపాల్‌పేట్ : దేశానికి, మనకు మంచి భవిష్యత్తు బాగుండాలంటే మానవత్వాన్ని నమ్మే వ్యక్తికి ఓటు వేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మేకలబండ, ఓల్డ్ గాస్మండి, విక్టోరియా గంజ్, ఓల్డ్ బోయిగూడ, పాన్‌బజార్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


పాదయాత్రలో పాల్గొన్న కోట నీలిమ


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు రవీందర్ గౌడ్

పద్మారావుగౌడ్ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి

● బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్

బంజారాహిల్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఖైరతాబాద్ నియోకవర్గంలో ఎన్నికల ప్రచార తీరుపై అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీ మంత్రి తలసానితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అన్ని సర్వేల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ముందంజలో ఉన్నాడని తేలిందన్నారు. ఖైరతాబాద్ ప్రజలు మొత్తం కాంగ్రెస్ అభ్యర్థి దానం మీద ఆగ్రహంతో ఉన్నారని, కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదనే అభిప్రాయం ప్రజల్లో ఉన్న కారణంగా పద్మారావు గౌడ్‌కే మద్దతు పలకాలని ఓటర్లు భావిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సమావేశంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్. శ్రీనివాస్, పార్టీ నేతలు విప్లవ కుమార్, మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు మన్నె కవిత, వి.వెంకటేష్, ప్రసన్న రామ్మూర్తి, హేమలత యాదవ్ తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

రాంగోపాల్‌పేట్ : బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ళ పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మెక్లోడ్‌గూడ, చుట్టాలబస్తీ, నల్లగుట్ట జే లైన్ బస్తీలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.


పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారంలో శ్రీనివాస్ గౌడ్


అడ్డగుట్టలో బీఆర్ఎస్ అభ్యర్థి తరుపున ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీను

కేసీఆర్ ఆదేశాలు పాటిస్తా

● సాయన్న ఆశయాలను కొనసాగిస్తా: నివేదిత

సికింద్రాబాద్, తిరుమలగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): సాయన్న మాదిరిగా నిత్యం ప్రజల కోసం పరితపించాలన్న మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలను పాటిస్తానని, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు కేరాఫ్‌గా నిలిచి, ముప్ఫై సంవత్సరాలకుపైగా కంటోన్మెంట్ ప్రజలతో మమేకమైన తన తండ్రి సాయన్న ఆశయాలను కొనసాగిస్తానని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత స్పష్టం చేశారు. 2వ వార్డు రసూల్‌పురా, శ్రీలంకబస్తీల్లో బుధవారం బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమె ఇంటింటికీ తిరిగి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శాసనసభ్యునిగా తన తండ్రి సాయన్న రసూల్‌పురా బస్తీల్లోని ప్రజలకు చేసిన సేవలను, వారిలో ఒకరిగా మెలిగిన తీరును నివేదిత ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆడ బిడ్డనైన తనను ఎన్నికల్లో గెలిపించి, మహిళ సత్తా చాటాలని స్థానిక మహిళలకు ఆమె విజ్ఞప్తి చేశారు.


రసూల్‌పురాలో నివేదితకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు


తిరుమలగిరిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నివేదిత


విజయకేతనం ఎగురవేస్తున్న మర్రి రాజశేఖరరెడ్డి,రావుల శ్రీధర్‌రెడ్డి, నివేదిత

దేశంలో మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ

● మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల

నేరేడ్‌మెట్, మే 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మరోసారి నరేంద్రమోదీయే ప్రధాని అవుతారని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం సాయంత్రం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జేజేనగర్‌లోని మహాబోధి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తమిళుల ఆత్మీయ సమావేశంలో అయన మాట్లాడారు. మోదీ హయాంలో దేశంలో మోడరన్ రైల్వే స్టేషన్లు నిర్మాణం, రైల్వే స్టేషన్లు విమానాశ్రయాల మాదిరిగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దేశంలో పేదల కోసం 12 కోట్ల టాయిలెట్లు కట్టించారన్నారు. జీఎస్‌టీని అమలు చేసిన గొప్ప నాయకుడు మోదీ అని ఆయన కొనియాడారు. దేశంలో టెర్రరిజంను అణచివేసి శాంతి నెలకొల్పిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం అంటే అభివృద్ధే కాదని, ప్రజల విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. దాదాపు ఐదు వందల ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న రామ మందిరాన్ని నిర్మించారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న భారతదేశాన్ని 5వ స్థానంలోకి తెచ్చిన ఘనత మోదీకి చెందుతుందని ఈటల చెప్పారు. దేశం సుస్థిరంగా ఉండాలన్నా, మన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాలన్నా దేశంలో బీజేపీతోనే సాధ్యమన్నారు. అల్వాల్ ప్రాంతంలో ఫ్లై ఓవర్లు నిర్మాణం, పేదల ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. మల్కాజిగిరి అభివృద్ధికోసం అనునిత్యం పాటుపడతానని, ఎల్లప్పుడు అందరికీ అందుబాటులో ఉంటానని, ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఈటల ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కొయంబత్తూరు ఎమ్మెల్యే జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతిశ్రీనివాసన్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణబాబు, నాయకులు గోపు రమణారెడ్డి, రమేష్‌గౌడ్, ధనలక్ష్మి, రవీందర్ రెడ్డి, ప్రసన్న, కన్నాబిరాన్ ఇతర నాయకులు, స్థానికులు, తమిళ కుటుంబాలు పాల్గొన్నాయి.


జేజేనగర్‌లోని మహాభోది ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తమిళుల ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల అభ్యున్నతి

రామంతాపూర్ : బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రామంతాపూర్‌లో బుధవారం బీజేవైఎం నాయకుడు గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధానిమోదీ నాయకత్వంలో అన్ని మతాలు, కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందని ఆయన అన్నారు. మల్కాజిగిరి ప్రజలు విజ్ఞతతో ఆలోచించి విలువైన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపిస్తే అన్నివిధాల అభివృద్ధి చేస్తానని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, బీజేపీ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్ సతీమణి జమున


కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మతసామరస్యాన్ని చూపే మోదీని ఆదరించండి

● కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశతిలక్

తిరుమలగిరి మే 8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశతిలక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బొల్లారం రిసాలబజార్, పయొనీర్ బజార్, డౌటన్ బజార్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్ భాయ్ హోటల్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఒక మతసామరస్యంతో ముందుకు పోతుందని, ఒక పార్టీకి ఒక దేవుడికి పరిమితం కాకుండా అన్ని మతస్థుల వారి వారి దేవుళ్లను పూజించుకునే హక్కు ఇచ్చిందని అలాంటి సమానత్వం చూపే మోదీ ప్రభుత్వాన్ని ఈసారి ఆదరించి భారతదేశాన్ని ఔనత్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు జనపల్లి శ్రీకాంత్, టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జనగామ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో వంశ తిలక్

పేదల సంక్షేమమే ధ్యేయం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

షాపూర్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ప్రచారంలో భద్రప్ప, లావణ్య సుభద్ర, ధనలక్ష్మి, భాగ్య, సువర్ణ, వెంకటమ్మ, విద్య, జయశ్రీ తదితరులు ఉన్నారు.


కల్యాణ్‌నగర్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

● **కొంపల్లిలో ప్రచారం**

పేట్‌బషీరాబాద్ : బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని జయభేరి, వెన్ సాయి అపార్టుమెంట్‌లో ఎన్నికల ప్రచారాన్ని కార్యకర్తలు, నాయకులతో కలిసి నిర్వహించారు. మున్సిపల్ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అందరూ పనిచేయాలన్నారు.


సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

బాలానగర్ : బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి బుధవారం కల్యాణ్‌నగర్‌లో ప్రచారాన్ని నిర్వహించారు. మొదట బస్తీలో ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ్‌నగర్‌లోని షటిల్ కోర్టును సందర్శించి క్రీడాకారులను, స్థానికులను కలిశారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు.



ప్రసంగిస్తున్న అన్నామలై

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రయోజనం లేదు

రెజిమెంటల్‌బజార్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రయోజనం లేదని బీజేపీకి వేస్తే దేశం అభివృద్ధి చెందుతుందని తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు అన్నామలై అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ సెంటర్‌లో ఉన్న ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన తమిళ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మళ్లీ మోదీ ప్రధానమంత్రి కావాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. మోదీని బడే భాయి అన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అలా పిలువకుండా రాహుల్ గాంధీ కట్టడి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశతిలక్, కార్పొరేటర్‌లు కొంతం దీపిక, సుచిత్ర, లక్ష్మీనారాయణ ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ శేషాద్రి, పీఎల్ శ్రీనివాస్, తమిళులు పాల్గొన్నారు.

కులమతాలను రెచ్చగొట్టి మోదీ రాజకీయం చేస్తున్నారు

● మంత్రి పొంగులేటి

రెజిమెంటల్‌బజార్, మే 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విభజనలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలను నేరవేర్చలేదు. కేవలం మతాలను, కులాలను రెచ్చగొట్టి మోదీ రాజకీయం చేస్తున్నారని, మూడు అక్షింతలు తల మీద వేసి మళ్లీ ప్రధానమంత్రి కావాలని మోదీ కలలు కంటున్నాడని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివిజన్‌లో కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునితామహేందర్ రెడ్డి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మర్రి అమరేందర్‌రెడ్డి, అల్లాడి గౌరి శంకర్, బాబురావు, రవి, ముప్పిడి గోపాల్,బద్రినాథ్ యాదవ్, శ్రవణ్ పాల్గొన్నారు.


రోడ్ షోలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నన్ను గెలిపించండి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తా

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్

సికింద్రాబాద్, బోయినపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉపఎన్నికలో తనను గెలిపించాలని, మీ పనివాడిగా నందమూరిగనర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని నందమూరి నగర్, సీతారాంపురం, మర్రిరాంరెడ్డి కాలనీ, భవానినగర్, వాణి కాన్వెంట్ స్కూల్ కాలనీలతో పాటు పలు కాలనీలలో నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్ ఇంటింటికీ తిరుగుతూ తనను గెలిపించాలని, కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


నందమూరినగర్ బస్తీ ప్రజలకు హామీ ఇస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్

అకాల వర్ష బాధితులకి అండగా కార్పొరేటర్

చిలకలగూడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : బుధవారం కురిసిన అకాల వర్షానికి మెట్టుగూడ డివిజన్ విజయపురి కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లడంతో కొన్ని ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరి సామాన్లు పాడైపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాసూరి సునీత రాత్రి 10.30కి అక్కడికి చేరుకుని జీహెచ్ఎంసీ, విపత్తు అధికారులని అలర్ట్ చేసి బాధితులకి నిత్యావసర వస్తువులు అందజేసి, నిరాశ్రయులకి తక్షణ అవసరాలు అందజేశారు.


డ్రైనేజీ మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత


బోయినపల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జంపన ప్రతాప్


వారాసిగూడ ప్రధాన రహదారిలో పడిపోయిన చెట్టుకొమ్మలను తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది

భవన నిర్మాణ కార్మికులను గౌరవించాలి

అడ్డగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మహిళల్ని గౌరవించాల్సిన బాధ్యత మన అందరికీ ఉందని యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ మమత సూచించారు. బుధవారం తుకారాంగేట్ చౌరస్తాలో కూలీల అడ్డా చౌరస్తా వద్ద భవన నిర్మాణ మహిళ కార్మికులతో ఈ సంస్థ ప్రత్యేక సమావేశ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులుకు ప్రభుత్వం నుంచే సంక్షేమ పథకాలు చాలా ఉన్నాయని, ఇవి ఎవరికీ తెలియకపోవడంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సమయంలో మహిళల్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి శుష్మ, భవన నిర్మాణ అసోసియేషన్ ప్రతినిధులు నగేష్, రవి, రమేష్‌లు పాల్గొన్నారు.


తుకారాంగేట్‌లో అడ్డా కూలీల చౌరస్తా వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తుకారాంగేట్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అడ్డగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం తుకారాంగేట్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సంఘం అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడు కుమార స్వామి, రాములు, కార్యదర్శి రవి, సంయుక్త కార్యదర్శి రెడ్డి, శ్రీకాంత్, సాయిలు, కోశాధికారి కే.నాగరాజు, కార్యదర్శులు రమేష్, సలహాదారుడు రాజు, సభ్యులు శేఖర్, మల్లేష్, ముసిన్, అశోక్, రమేష్, మురళి, సాయిలు, సల్మాన్, మణేమ్, దశరథ్, శ్రీనివాస్‌లతో పలువురు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీసీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ వ్యవహరించారు.